
సాక్షి నల్లగొండ

గురువారం ♦ 25 ♦ జూలై ♦ 2024



నేటి నుంచి మూసీ నీటి విడుదల

మూసీ ప్రాజెక్టు ఆయకట్టులో పంటల సాగుకు గురువారం నీటి విడుదలకు అధికారులు ఏర్పాట్లు చేశారు. - 8లో



నేతన్నకు దక్కిన గౌరవం

చౌటుప్పల్ మండలం ఎల్లంబావికి చెందిన చేనేత కార్మికుడు కర్నాటి ముఖేష్‌ను జాతీయ పురస్కారం వరించింది. - 8లో



ఉద్యమాలు చేపట్టాలి

అమరుల స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు చేపట్టాలని సీపీఎం నేతలు బి.వెంకట్, జూలకంటి రంగారెడ్డి పిలుపునిచ్చారు. - 8లో

న్యూస్‌రీల్

సగటు వర్షపాతం 7.4 మిల్లీమీటర్లు

నల్లగొండ అగ్రికల్చర్: నైరుతి రుతుపవనాల కారణంగా జిల్లాలో మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకు సరాసరి 7.4 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. అత్యధికంగా చిట్యాల మండలంలో 25.4 మిల్లీమీటర్లు, అత్యల్పంగా కేతేపల్లి మండలంలో 0.3 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. అలాగే డిండి (గుండ్లపల్లి) 11.9, పెద్దవూర 11.1, తిరుమలగిరిసాగర్ 11.0, మర్రిగూడ 10.3, చందంపేట 10.2, అడవిదేవులపల్లి 10.1, దేవరకొండ 9.5, గుర్రంపోడు 9.4, మునుగోడు 9.2, పీఏపల్లి 9.1, అనుములహాలియా 9.0 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. కనగల్ 8.4, నిడమనూరు 8.4, త్రిపురారం 7.9, దామెరచర్ల 7.7, చండూరు 7.6, కొండమల్లేపల్లి 7.4, నాంపల్లి 7.4, నేరెడుగొమ్ము 7.3, గట్టుప్పల్ 6.5, మిర్యాలగూడ 5.7, చింతపల్లి 5.4, నల్లగొండ 5.3, తిప్పర్తి 4.2, వేములపల్లి 3.9, నార్కట్‌పల్లి 2.8, కట్టంగూర్ 1.6, ముడుగులపల్లి 1.2, శాలిగౌరారం 0.9, నకిరేకల్ మండలంలో 0.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

రుణమాఫీకి రేషన్‌కార్డు ప్రామాణికం కాదు



దామరచర్లలో రైతులతో మాట్లాడుతున్న డీఏఓ శ్రవణ్‌కుమార్

మిర్యాలగూడ: రైతు రుణమాఫీకి రేషన్‌కార్డు ప్రామాణికం కాదని రైతులెవ్వరూ అపోహలకు గురికావద్దని జిల్లా వ్యవసాయాధికారి(డీఏఓ) పాల్వాయి శ్రవణ్‌కుమార్ అన్నారు. బుధవారం దామరచర్ల మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.2లక్షల రుణమాఫీ చేసేందుకు 2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 9వరకు వ్యవసాయ రుణాలు పొందిన రైతులకు రుణమాఫీ చేస్తుందన్నారు. రుణమాఫీ పొందిన రైతులంతా బ్యాంకులకు వెళ్లి రెన్యూవల్ చేయించుకోవాలని సూచించారు. కొత్తగా పాస్ పుస్తకాలు పొంది ఉండి 18 నుంచి 59 సంవత్సరాలుగల ప్రతి రైతు ప్రభుత్వం అందించే రైతు బీమా పథకానికి అర్హులని పేర్కొన్నారు. ఆగస్టు 5వ తేదీ వరకు స్థానిక రైతు వేదిక కార్యాలయంలోని ఏఈఓలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. రైతు బీమాలో తప్పుల సవరణకు ఈనెల 30 వరకు అవకాశం ఉందన్నారు. గతంలో దరఖాస్తు చేసుకున్న రైతులు తిరిగి దరఖాస్తు చేసుకోకూడదని తెలిపారు. దామరచర్ల మండలంలో రైతులకు సరిపోను యూరియా, డీఏపీ కాంప్లెక్స్ ఎరువులు ఉన్నాయన్నారు. సమావేశంలో ఏఓ కల్యాణ్‌చక్రవర్తి, ఏఈఓలు రూపావతి పార్వతి, రమేష్, నాగమణి, రైతులు పాల్గొన్నారు.

హాలియా బస్టాండ్‌లో సౌకర్యాలు కల్పిస్తాం



హాలియాలో ఆర్టీసీ బస్టాండ్‌లో చెక్ రికార్డును పరిశీలిస్తున్న ఆర్ఎం రాజశేఖర్

హాలియా: హాలియా పట్టణంలోని బస్టాండ్‌లో ప్రయాణికుల కోసం అన్నిరకాల సౌకర్యాలు కల్పిస్తామని ఆర్టీసీ ఆర్ఎం రాజశేఖర్ అన్నారు. హాలియాలోని ఆర్టీసీ బస్టాండ్‌ను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా బస్టాండ్‌లోని చెక్ రికార్డుతో పాటు బస్టాండ్ పరిసరాలను పరిశీలించారు. బస్టాండ్‌లో ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలు ఏవైన ఉన్నాయా అని కంట్రోలర్ సంపత్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బస్టాండ్ ప్రాంగణమంతా కలియదిరిగి చూశారు. ఈ సందర్భంగా ఆర్ఎం మాట్లాడారు. ఆయన వెంట నల్లగొండ డిపో మేనేజర్ శ్రీనాథ్, స్థానిక సిబ్బంది ఉన్నారు.

పనులు త్వరగా పూర్తిచేయాలి

కొండమల్లేపల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతనంగా చేపట్టిన అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను త్వరగా చేపట్టాలని జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం డీఈఓ భిక్షపతితో కలిసి ఆయన పాఠశాలలో కొనసాగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. వారి వెంట ఎంపీడీఓ రాంరెడ్డి, వైద్యాధికారి ఉషారాణి, హెచ్ఎం నాగేశ్వర్‌రావు, దూదిపాల శ్రీధర్‌రెడ్డి, వైద్య సిబ్బంది ఉన్నారు.

నీళ్లకు నిధులెన్ని?



ఎస్ఎల్‌బీసీ సొరంగం

రాష్ట్ర బడ్జెట్‌పై రైతుల ఆశలు

- ఉమ్మడి జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి ఎదురుచూపు
- లిఫ్ట్‌లకు, ఎస్ఎల్‌బీసీకి నిధులు వస్తాయని భావిస్తున్న రైతులు
- గ్రీన్ ఛానెల్ ద్వారా నిధులు ఇస్తామని ఇప్పటికే ప్రకటించిన మంత్రులు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: రాష్ట్ర బడ్జెట్‌పై ఉమ్మడి జిల్లా రైతులు భారీగా ఆశలు పెట్టుకున్నారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క గురువారం అసెంబ్లీలో బడ్జెట్‌ను ప్రవేశ పెట్టనున్నారు. ఇందులో ఎస్ఎల్‌బీసీ టన్నెల్, ఉమ్మడి జిల్లాలోని ఇతర లిఫ్టులు, సాగర్ ఎడమ కాలువ మరమ్మతులు, ఏఎంఆర్‌పీ కాలువల విస్తరణ పనులకు ఎన్ని నిధులు వస్తాయోనని రైతులు ఎదురుచూస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే.. ఎస్ఎల్‌బీసీ సొరంగమార్గంతో పాటు డిండి, బ్రాహ్మణవెల్లెంల ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యతనిచ్చి త్వరగా పూర్తి చేస్తామని అసెంబ్లీ ఎన్నికల్లో హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో పాటు ఉమ్మడి జిల్లాలో ఇద్దరికి మంత్రి పదవులు దక్కాయి. ప్రభుత్వం ఏర్పడి తర్వాత జరిగిన సమావేశాల్లో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఇద్దరూ ఉమ్మడి జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను మూడేళ్ల కాలంలో పూర్తి చేస్తామని ప్రకటించారు. ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గానికి గ్రీన్ చానెల్ ద్వారా నిధులను ఇస్తామని, ఏఎంఆర్‌పీ కాలువలు లైనింగ్ కాలువలకు నిధులను మంజూరు చేయించి, పనులను ప్రారంభిస్తామని మంత్రి వెంకట్‌రెడ్డి ప్రకటించారు. రూ.525 కోట్లతో కాలువల లైనింగ్ చేపడతామని పేర్కొన్నారు. సూర్యాపేట జిల్లాలోనూ ఎత్తిపోతల పథకాలకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హామీ ఇచ్చారు. దీంతో జిల్లా ప్రజలు మంత్రులపైనే పూర్తిగా ఆశలు పెట్టుకున్నారు.

పదేళ్లలో కేటాయింపులు ఏమీలేవు

ఉమ్మడి జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులకు గడిచిన పదేళ్ల కాలంలో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్దగా నిధులు కేటాయించలేదు. ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గం ఎప్పుడో పూర్తికావాల్సి ఉన్నా నిధుల లేమి కారణంగా ఇంకా 9.5 కిలోమీటర్ల పొడవు తవ్వాల్సి ఉంది. ఎస్ఎల్‌బీసీ సొరంగం, ఏఎంఆర్‌పీ కాలువల విస్తరణ, సాగర్ ఎడమ కాలువ మరమ్మతులు, బ్రాహ్మణవెల్లెంల వంటి ప్రాజెక్టుకు పెద్దగా నిధులను కేటాయించలేదు. డిండి ఎత్తిపోతల కింద నిర్మిస్తున్న సింగరాజుపల్లి, కిష్టరాయినిపల్లి, గొట్టిముక్కుల, చింతపల్లి, చర్లగూడెం రిజర్వాయర్లు ఎక్కడా వందశాతం పూర్తి కాలేదు. అంతేకాకుండా నాగార్జునసాగర్ ఉప ఎన్నికల తరువాత 15 ఎత్తిపోతల పథకాలకు అప్పటి సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేశారు. అందులో ఒకటీ రెండు పథకాల పనులే ప్రారంభం కాకపోగా, మిగతా వాటిల్లో సగం పనులు కూడా కాలేదు.

బస్వాపురానికి మరిన్ని నిధులు అవసరం

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా భువనగిరి మండలంలో నిర్మిస్తున్న బస్వాపూర్ రిజర్వాయర్ పనులకు మరో రూ.250 కోట్లు అవసరమని అధికారులు అంచనా వేశారు. ముంపు బాధితులు, కాలువల్లో భూములు కోల్పోతున్న వారికి పూర్తిస్థాయిలో పరిహారం అందలేదు. గంధమల్ల రిజర్వాయర్ నిర్మాణంపై స్పష్టతే లేదు. ఈ రెండు ప్రాజెక్టుల ద్వారా ఆలేరు, భువనగిరి, నకిరేకల్, మునుగోడు, నియోజకవర్గాలకు సాగునీరు అందించాల్సి ఉంది.

నిధులు పెద్ద మొత్తంలో అవసరం

ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌ను పూర్తి చేసేందుకు రూ.5 వేల కోట్లు అవసరం కాగా, నాగార్జునసాగర్, మిర్యాలగూడ, దేవరకొండ, హుజూర్‌నగర్, నల్లగొండ నియోజకవర్గాల్లో మంజూరు చేసిన నెల్లికల్, అయిటిపాముల సహా పలు ఎత్తిపోతల పథకాలకు దాదాపు రూ.3,346 కోట్లు, బ్రాహ్మణవెల్లెంల కాలువల పనులకు రూ.250 కోట్లు అవసరం. ఒక్క సూర్యాపేట జిల్లాలో ఇరిగేషన్ ప్రాజెక్టుల కోసం రూ.490 కోట్ల అవసరం ఉన్నట్లు అధికారులు ప్రతిపాదించారు. అందులో ఎస్సారెస్పీ రెండో దశ ప్రధాన కాలువ లైనింగ్‌కే రూ.450 కోట్లు, చెరువుల మరమ్మతులకు రూ.30కోట్లు అవసరం. హుజూర్‌నగర్, కోదాడలోని ముక్త్యేశ్వరపురం, గణపవరం మేజర్ల ఆయకట్టు రైతులకు సాగు నీటిని అందించేందుకు రూ.394 కోట్లతో రాజీవ్‌గాంధీ ఎత్తిపోతల పథకం నిర్మించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

మూసీ జలాల సద్వినియోగం ఎప్పుడో..

వృథాగా పోతున్న మూసీ జలాలను సద్వినియోగం చేసుకొని ఆయకట్టును మరింత స్థిరీకరించేందుకు ధర్మారెడ్డిపల్లి, పిల్లాయిపల్లి, బునాదిగాని కాలువల ఆధునీకరిస్తామని ప్రభుత్వం పేర్కొంది. 2013లో రూ.320 కోట్ల అంచనా వ్యయంతో టెండర్ల పిలిచిన అనంతరం రూ.280 కోట్లకు పరిపాలనా ఆమోదం లభించింది. 2016లో ఆ కాలువల పనులను ఒకే ప్యాకేజీ కింద రూ.222 కోట్లతో ప్రారంభించినా నేటికీ పూర్తి కాలేదు. వీటితోపాటు ఆలేరు, గుండాల మండలాలకు సాగు నీరిందించే దేవాదుల కాలువల పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి.

ఇంటింటా జ్వర సర్వే నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

- కలెక్టర్ నారాయణరెడ్డి

నల్లగొండ: జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో శుక్రవారం నుంచి ఇంటింటా జ్వర సర్వే నిర్వహించాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశించారు. బుధవారం ఆయన జిల్లా కలెక్టరేట్‌లో వివిధ అంశాలపై మున్సిపల్ కమిషనర్లు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటి జ్వర సర్వే కోసం మెప్మా, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందితో బృందాలు ఏర్పాటు చేసి వారికి గురువారం శిక్షణ ఇవ్వాలన్నారు. సర్వే చేసే బృందాలు అన్ని వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. జ్వర సర్వేతోపాటు, దోమల నిర్మూలన కార్యక్రమాలను చేపట్టాలని ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్లు మున్సిపాలిటీ పరిధిలో శానిటేషన్‌తోపాటు, నీరు కలుషితం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. మున్సిపాలిటీల్లోని వాణిజ్య ప్రదేశాల్లో మహిళా శక్తి క్యాంటీన్లు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్ర, విద్యుత్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఖైదీల ఉపాధికి ప్రణాళిక రూపొందించాలి



జైలులో ఆహారాన్ని రుచి చూస్తున్న కలెక్టర్

నల్లగొండ క్రైం, నల్లగొండ రూరల్: జైలు నుంచి విడుదలైన వారితోపాటు ఖైదీల ఉపాధికి ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి సూచించారు. బుధవారం ఆయన నల్లగొండలోని జిల్లా జైలు తనిఖీ చేశారు. జైలులో ఉన్న శుభ్రత పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. జైలు రికార్డులు పరిశీలించారు. ఖైదీలకు కల్పిస్తున్న సౌకర్యాలతోపాటు వారు ఏ కారణం చేత జైలుకు వచ్చారో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జైలు నుంచి విడుదలయ్యేలోపు ఖైదీలను మంచి పౌరుడిగా మార్చాలని జైలు అధికారులను సూచించారు. అనంతరం అన్నపూర్ణ క్యాంటీన్‌ను పరిశీలించారు. భోజనం చేస్తున్న కూలీలు, ఆటో రిక్షా కార్మికులతో కలెక్టర్ ముచ్చటించి భోజనం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, తాగునీటి కోసం నల్లా పెట్టించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. జైలులో కలెక్టర్ వెంట జిల్లా జైలర్ అనిల్‌కుమార్, డిప్యూటీ జైలర్ వెంకట్‌రెడ్డి, నరేష్, వైద్యాధికారి దీప్తి, రామలింగం ఉన్నారు.

నిధుల కేటాయింపులో తెలంగాణపై వివక్ష

- బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్



మాట్లాడుతున్న రమావత్ రవీంద్ర కుమార్

నల్లగొండ టూటౌన్: కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి నిధులు కేటాయించకుండా రాష్ట్రంపై సవతితల్లి ప్రేమ చూపిస్తోందని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య, జెడ్పీ చైర్మన్ బడా నరేందర్‌రెడ్డితో కలిసి బుధవారం నల్లగొండలోని ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బడ్జెట్లో రాష్ట్రానికి నిధులు ఇవ్వకుండా కేంద్రం వివక్ష చూపించిందన్నారు. బీజేపీకి 8 మంది ఎంపీలను ఇస్తే రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేశారని, పక్క రాష్ట్రం ఏపీకి 15 వేల కోట్లు ఇచ్చి, తెలంగాణకు నయాపైసా ఇవ్వకపోవడం వివక్ష కాదా అని ప్రశ్నించారు. రాష్ట్రం నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నా ఒరిగిందేమీ లేదన్నారు. ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరిస్తున్న కేంద్ర ప్రభుత్వంపై ఉద్యమిస్తామన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి నిరంజన్ వలీ, పంకజ్‌యాదవ్, కటికం సత్తయ్యగౌడ్, మాలె శరణ్యారెడ్డి, రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, మందడి సైదిరెడ్డి, బోనగిరి దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

- అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర

అడవిదేవులపల్లి: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రుణ సహకారాన్ని స్వయం సహాయ సంఘాల మహిళలు సద్వినియోగం చేసుకుంటూ ఆర్థికంగా ఎదగాలని జిల్లా అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర అన్నారు. అడవిదేవులపల్లి మండల కేంద్రంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుటీర పరిశ్రమతో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు. రోగుల సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం డీఆర్‌డీఏ ప్రాజెక్టు అసిస్టెంట్ డైరెక్టర్ శారదతో కలిసి వన మహోత్సవంలో భాగంగా ఎంపీడీఓ కార్యాలయంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు కుటీర పరిశ్రమను ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. ప్రస్తుతం వర్షాకాలంలో అంటువ్యాధులు సోకకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ కరుణాకర్‌రావు, ఎంపీఓ ఎండీ.మోహసిన్‌బిన్ అహ్మద్, ఏపీఓ సూరనాయక్, ఏపీఎం శేషయ్య, అధికారులు, సిబ్బంది ఉన్నారు. ఈ సందర్భంగా అడవిదేవులపల్లి కేజీబీవీకి ప్రహరీతోపాటు అద్దె భవనాల్లో కొనసాగుతున్న ప్రభుత్వ ఆఫీసులకు పక్కా భవనాలు నిర్మించాలని కోరుతూ అదనపు కలెక్టర్ పూర్ణచంద్రకు ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కుర్ర సైదానాయక్ తదితరులు వినతిపత్రం అందజేశారు.

ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలి

- ఎస్పీ శరత్‌చంద్ర పవార్
- మీట్ యువర్ ఎస్పీ కార్యక్రమానికి విశేష స్పందన



ఎస్పీకి సమస్యను వివరిస్తున్న చిన్నయ్య

నాగార్జునసాగర్: బాధితులు అందించిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించి పోలీస్ శాఖపై నమ్మకం కలిగేలా పోలీసులు వ్యవహరించాలని జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ పేర్కొన్నారు. ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరించేందుకుగాను నాగార్జునసాగర్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఆయన మీట్ యువర్ ఎస్పీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడారు. ఆంధ్రా–తెలంగాణ సరిహద్దు ప్రాంతమైనందున అక్రమ వ్యాపారాలు జరుగకుండా నిరంతరం పర్యవేక్షణ ఉంచాలన్నారు. ముందుగా మిర్యాలగూడ డీఎస్పీ, సాగర్ సీఐ, ఎస్ఐతో కలిసి స్టేషన్‌లోని రికార్డులు, అన్ని గదులను పరిశీలించారు.

అందిన ఫిర్యాదులు 15

మీట్ యువర్ ఎస్పీ కార్యక్రమానికి మొత్తం 15 ఫిర్యాదులు వచ్చాయి. అందులో అధికంగా కుటుంబ, భూముల తగాదాలపై ఫిర్యాదులు అందాయి. వీటితోపాటు తపాలా కార్యాలయంలో దాచుకున్న నగదును పోస్ట్‌మెన్ కాజేశాడని పలువురు ఫిర్యాదు చేశారు. తిరుమలగిరి(సాగర్) పోలీస్‌స్టేషన్ పరిధిలో కలిపిన 20 గ్రామాలను గతంలో ఉన్నట్టుగానే సాగర్ స్టేషన్ పరిధిలో ఉంచాలని నాయకునితండా, చింతలపాలెం తదితర గ్రామాల ప్రజలు జిల్లా ఎస్పీకి విన్నవించారు. ఏపీ సరిహద్దులో ఉండడంతో మా గ్రామాల్లోకి ఆంధ్రావాళ్లు వచ్చి అసాంఘిక కార్యకలాపాలు కొనసాగిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కృష్ణాతీరంలో తాము సాగుచేసుకుంటున్న అటవీ భూముల్లోకి అధికారులు రానివ్వడం లేదని, మా భూములకు పట్టాలు ఇప్పించాలని కొందరు దరఖాస్తులు అందజేశారు. దీంతో ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది.

> **మా డబ్బులు మాకు ఇప్పించండి**
>
> పైలాన్ కాలనీలోని సబ్ పోస్టాఫీస్‌లో మా కుటుంబ సభ్యులు దాచుకున్న రూ.33లక్షల నగదును పోస్ట్‌మెన్ కాజేశాడు. ఏడాదిగా కేసు తేలక నగదు మా చేతికందలేదు. మేమే కాదు పైలాన్‌లో చాలామందివి సుమారుగా రూ.2కోట్ల మేర నగదును కాజేశాడు. మా డబ్బులు మాకు ఇప్పించి న్యాయం చేయండి.
>
> – చిన్నయ్య, పైలాన్ కాలనీ

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండండి



మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని జిల్లా ఎస్పీ శరత్‌చంద్రపవార్ అన్నారు. నాగార్జునసాగర్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం జరిగిన మీట్ యువర్ ఎస్పీ కార్యక్రమానికి హాజరైన అనంతరం జాగృతి పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో హిల్‌కాలనీలోని రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో యువతకు ఏర్పాటు చేసిన మిషన్ పరివర్తన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కృష్ణపట్టె గ్రామాల్లో గంజాయి సేవించే, విక్రయించేవారి పేర్లు తమ వద్ద ఉన్నాయని, గంజాయి జోలికి వెళ్లొదని హెచ్చరించారు. గంజాయికి అలవాటు పడితే జీవితం అంధకారంగా మారుతుందన్నారు. అత్యాశకు సైబర్ నేరగాళ్ల బారిన పడి మోసపోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖరరాజు, నాగార్జునసాగర్ సీఐ బీసన్న, ఎస్ఐ సంపత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మిషన్ పరివర్తన్‌కు హాజరైన యువత

ఆర్టీసీ బస్సుల్లోనే సురక్షిత ప్రయాణం

నల్లగొండ రూరల్: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం అంటేనే సురక్షితమని, అదే ప్రయాణికులకు భరోసా అని జిల్లా మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ లావణ్య అన్నారు. బుధవారం నల్లగొండలోని ఆర్టీసీ డిపోలో ప్రమాద రహిత వారోత్సవాలను ప్రారంభించిన సందర్భంగా డ్రైవర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. డ్రైవర్లు అప్రమత్తంగా ఉంటేనే బస్‌లో ప్రయాణించే వారితో పాటు వారి కుటుంబ సభ్యులు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకుంటారన్నారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్ మానవ తప్పిదమని తెలిసినా ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపడం వల్ల అనేక మంది మృత్యువాత పడుతున్నారని గుర్తు చేశారు. అత్యవసరమైతే రోడ్డు పక్కకు బస్సును ఆపి మాట్లాడాలన్నారు. ఎక్కడ పడితే అక్కడ బస్‌లను ఆపి ఇతరులకు అంతరాయం కలిగించరాదన్నారు. ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ఎలాంటి ప్రమాదాలు జరగవన్నారు. నల్లగొండ ఆర్టీసీ ప్రమాద రహితంగా పేరు పొందడం ప్రశంసనీయమన్నారు. ఈ సమావేశంలో ఆర్టీసీ ఆర్ఎం రాజశేఖర్, డిపో మేనేజర్ శ్రీనాథ్, హుస్సేన్, జయప్రకాష్, ప్రభాకర్, ఏఆర్.రెడ్డి, శౌరయ్య, పాపయ్య, నరేందర్, సైదుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతులపై మళ్లీ ఆశలు

- జిల్లా వ్యాప్తంగా మిగిలిపోయిన ఉపాధ్యాయ ఖాళీలు 109
- ప్రమోషన్ల ద్వారా భర్తీచేసేందుకు విద్యా శాఖ కసరత్తు
- ఎన్ని పోస్టులకు అర్హత ఉన్నా ఒక్కదానికే ఆప్షన్ ఇవ్వాలని నిర్ణయం



నల్లగొండ: గతనెలలో చేపట్టిన ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ పూర్తయిన తర్వాత మిగిలిపోయిన ఖాళీలను మళ్లీ పదోన్నతులతో భర్తీ చేసేందుకు విద్యా శాఖ కసరత్తు చేస్తోంది. దీంతో పదోన్నతులపై ఉపాధ్యాయుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. గతంలో ఒక్కో ఉపాధ్యాయుడు రెండు నుంచి మూడేసి పోస్టుల్లో పదోన్నతి పొంది ఒక పోస్టులో జాయిన్ కావడంతో మిగతావి ఖాళీగా మిగిలిపోయాయి. కొందరు పదోన్నతి పొంది కూడా పోస్టు వద్దని రాసిచ్చారు. దీంతో మిగిలిన స్థానాల్లో సీనియారిటీ పద్ధతిన ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించనున్నారు. జిల్లాలో 109 ఖాళీలు మిగిలి ఉన్నాయి.

వెబ్ ఆప్షన్ విధానం వల్ల నష్టం..

మిగిలిన ఖాళీ పోస్టుల్లో తర్వాత ఉపాధ్యాయులు పదోన్నతి పొందేందుకు అర్హత ఉన్నాకూడా వెబ్ ఆప్షన్ విధానం వల్ల వారు పదోన్నతులు పొందకుండా నష్టపోయారు. దీంతో ఖాళీగా ఏర్పడ్డ స్థానాలను మరలా పదోన్నతుల ద్వారా భర్తీచేయాలని ఉపాధ్యాయ సంఘాలన్నీ ప్రభుత్వానికి విన్నవించాయి. దీనికి ప్రభుత్వం అంగీకరించి మిగిలిన ఖాళీలను పదోన్నతులతో భర్తీచేసేందుకు సిద్ధమైంది.

ఈసారి ఒక్క పోస్టే ఎంచుకునే అవకాశం

గతనెల జరిగిన పదోన్నతుల్లో అర్హతలను బట్టి కొందరు ఉపాధ్యాయులు అన్ని సబ్జెక్టులకు దరఖాస్తులు చేసుకున్నారు. దీంతో రెండు మూడు పదోన్నతులు వచ్చిన వారు ఒకే పదోన్నతిలో చేరడంతో మిగతావి ఖాళీగా మిగిలిపోయాయి. మిగిలిన ఖాళీల్లో ఈసారి సీనియారిటీ ప్రకారం ఆ ఉపాధ్యాయులు ఎన్ని సబ్జెక్టుల్లో పదోన్నతి పొందేందుకు అవకాశం ఉందో పరిశీలించుకుని ఏ సబ్జెక్టులో పదోన్నతి కావాలనుకుంటారో ఆ సబ్జెక్టు ఒక్కటి మాత్రమే ఆప్షన్ ఇవ్వాలని విద్యా శాఖ నిర్ణయించింది. దీంతో మిగిలిన సబ్జెక్టుల్లో ఆ తర్వాత వారికి పోస్టులు దక్కే అవకాశం ఉంటుంది. ఫలితంగా అన్ని ఖాళీలు పదోన్నతుల ద్వారా భర్తీ కానున్నాయని విద్యా శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి.

ఉపాధ్యాయుల నుంచి ఆప్షన్లు స్వీకరణ

మిగిలిన ఖాళీల్లో పదోన్నతులతో నింపేందుకు విద్యా శాఖ బుధవారం నుంచి ఆప్షన్లు స్వీకరిస్తోంది. వాటిని పరిశీలించి సీనియారిటీ, ఖాళీల జాబితాలను రాత్రి విద్యా శాఖ ఉన్నతాధికారులకు పంపారు. తుది జాబితా ప్రకారం ఉపాధ్యాయుల నుంచి మళ్లీ వెబ్ ఆప్షన్లు అడిగి పోస్టింగ్‌లు ఇవ్వనున్నారు.

జిల్లాలో మిగిలిన ఖాళీ పోస్టులు..

పోస్టు	ప్రభుత్వ	ఎల్‌బీ	మొత్తం
పీఎస్ హెచ్‌ఎం	02	23	25
ఎస్ఏ బయాలజీ	02	11	13
ఎస్ఏ ఇంగ్లిష్	03	14	17
ఎస్ఏ హిందీ	-	06	06
ఎస్ఏ మ్యాథ్స్	-	04	04
ఎస్ఏ పీడీ	-	03	03
ఎస్ఏ ఫిజిక్స్	-	05	05
ఎస్ఏ సోషల్	02	28	30
ఎస్ఏ ప్రత్యేక విద్య	-	02	02
ఎస్ఏ తెలుగు	-	04	04
మొత్తం	09	100	109

క్లుప్తంగా

లారీ ఢీకొని మహిళ మృతి

కొండమల్లేపల్లి: రోడ్డు దాటుతుండగా లారీ ఢీకొని మహిళ మృతిచెందింది. ఈ ఘటన కొండమల్లేపల్లి మండల కేంద్రంలో బుధవారం జరిగింది. కొండమల్లేపల్లి మండలం రాము నిగుండ్లతండాకు చెందిన రమావత్ చిన్ని(42) తన భర్త రామ్‌చంద్‌తో కలిసి కనగల్ మండలం దర్వేశిపురంలో తమ బంధువుల పుట్టిన రోజు వేడుకలకు హాజరయ్యేందుకు తండా నుంచి బయల్దేరి కొండమల్లేపల్లికి చేరుకున్నారు. నల్లగొండ వైపు వెళ్లే బస్సుల కోసం కొండమల్లేపల్లిలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద వారిద్దరు రోడ్డు దాటుతుండగా.. జడ్చర్ల నుంచి కోదాడ వెళ్తున్న లారీ సాగర్ రోడ్డు వైపు మళ్లే క్రమంలో చిన్నిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చిన్ని తల పైనుంచి లారీ వెళ్లడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని చిన్ని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామ్మూర్తి తెలిపారు. మృతురాలికి భర్త, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

చికిత్స పొందుతూ..


చిన్ని (ఫైల్)

రామగిరి(నల్లగొండ): ఆర్థిక ఇబ్బందులతో పురుగుల మందు తాగిన మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిప్పర్తి మండలం మామిడాల గ్రామానికి చెందిన నల్లగొండ లక్ష్మి(40) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఆర్థిక ఇబ్బందుల వలన అప్పులు ఎక్కువవ్వడంతో మానసిక ఆందోళనకు గురైన లక్ష్మి ఈ నెల 21వ తేదీన ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు గమనించి నల్లగొండ పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందింది. మృతురాలికి భర్త, కుమార్తె ఉన్నారు. మృతురాలి కుమార్తె నల్లగొండ జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తిప్పర్తి ఏఎస్ఐ రామ్మూర్తి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వలస కార్మికుడు దుర్మరణం

యాదగిరిగుట్ట రూరల్: రోడ్డు ప్రమాదంలో వలస కార్మికుడు మృతి చెందాడు. ఈ ఘటన యాదగిరిగుట్ట మండలం వంగపల్లి వద్ద బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వంగపల్లి గ్రామంలోని ఎంఎస్ఎన్ ఫార్మాస్యూటికల్ కంపెనీలో కాంట్రాక్ట్ కూలీగా జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన భువనేశ్వర్(40) పనిచేస్తున్నాడు. గ్రామంలోని ప్రధాన రహదారి వేబ్రిడ్జి సమీపంలో నివాసముంటున్నాడు. బుధవారం సాయంత్రం వ్యక్తిగత పని నిమిత్తం భువనేశ్వర్ తన ఇంటి నుంచి గ్రామంలోని మెయిన్ సెంటర్‌కు ప్రధాన రహదారి గుండా నడుచుకుంటూ వెళ్తున్నాడు. అదే సమయంలో ద్విచక్ర వాహనం మీద ప్రయాణిస్తున్న అదే మగ్రామానికి చెందిన ముగ్గురు యువకులు వెనుక నుండి భువనేశ్వర్‌ను ఢీకొట్టడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రమేష్ తెలిపారు.

గుప్త నిధుల కోసం తవ్వకాలు.. ఆరుగురిపై కేసు నమోదు

నాగార్జునసాగర్: నందికొండ మున్సిపాలిటీ పరిధి మత్స్యకారుల కాలనీలోని ఓ ఇంట్లో గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపిన ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు విజయపురిటౌన్ ఎస్ఐ సంపత్‌గౌడ్ తెలిపారు. ఇంటి యాజమాని కోడ మల్లి, అతడి అన్నదమ్ములు కోడ శ్రీను, కోడ సత్తి, కోడ నాగతో పాటు హైదరాబాద్ నుంచి వచ్చిన ఇద్దరు మంత్రగాళ్లను అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. వారు స్టేషన్ బెయిల్‌పై విడుదలైనట్లు సమాచారం.

రైతు బీమాకు ఆగస్టు 5 గడువు

- కొత్తగా దరఖాస్తు చేసుకునే వారికి అవకాశం
- పాత వారికి ప్రభుత్వమే రెన్యూవల్ చేయనున్నట్లు ప్రకటన



నల్లగొండ టౌన్: రాష్ట్రంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు బీమా పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం యథావిధిగా కొనసాగించాలని నిర్ణయించింది. అందులో భాగంగా రైతు బీమాకు అవసరమైన ప్రీమియం చెల్లించేందుకు నిధులు కేటాయించింది. రైతు బీమా పథకం వల్ల కుటుంబ పెద్ద ప్రమాదవశాత్తు లేదా ఏ ఇతర కారణాల వల్లనైనా మరణిస్తే ఆ కుటుంబం వీధిన పడకుండా ఉండేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతు బీమా పథకాన్ని ప్రవేశపెట్టింది. రైతు బీమా ఉన్న రైతు మరణిస్తే పది రోజుల్లోనే ఆ కుటుంబానికి బీమా సొమ్ము రూ.5లక్షలు ప్రభుత్వం అందజేస్తుంది. రైతుపై ఎలాంటి భారం పడకుండా ప్రభుత్వమే రైతు బీమా ప్రీమియం చెల్లించనుంది.

కొత్త పాసుపుస్తకాలు వచ్చిన వారికి అవకాశం..

నల్లగొండ జిల్లాలో ప్రస్తుతం రైతు బీమా పథకం కింద అర్హులైన వారు 3లక్షల మందికి ప్రభుత్వమే రైతు బీమా ప్రీమియాన్ని చెల్లిస్తుంది. జిల్లాలో కొత్తగా 30వేల మంది రైతులకు కొత్తగా పట్టాదారు పాసుపుస్తకాలు వచ్చాయి. వీరంతా రైతు బీమా పథకం కోసం ఆగస్టు 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. గతంలో ఈ బీమా పథకం కింద అర్హులైన 3లక్షల రైతులకు యథావిధిగా ప్రభుత్వమే రెన్యూవల్ చేసి బీమా ప్రీమియాన్ని చెల్లించనుంది. కొత్త పాసుపుస్తకాలు ఉన్న వారితో పాటు జిల్లా వ్యాప్తంగా మరో 6వేల మంది వరకు బీమా పథకం కోసం దరఖాస్తు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. వీరు కూడా వచ్చే నెల 5వ తేదీలోగా రైతు బీమా కోసం దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుంది. కొత్తగా బీమా కోసం దరఖాస్తు చేసుకునే రైతులు రైతు బీమా దరఖాస్తును పూర్తిచేసి పాసుపుస్తకం జిరాక్స్, ఆధార్‌కార్డు, నామిని పేరు, నామిని ఆధార్ కార్డు జిరాక్స్‌ను సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులకు అందజేయాల్సి ఉంటుంది. అదే విధంగా నామినీ పేరు మార్పు చేయాలనేకునే వారికి కూడా ప్రభుత్వం అవకాశం కల్పించింది.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



కొత్తగా పట్టాదారు పాసు పుస్తకాలు వచ్చిన రైతులు, గతంలో రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకోని రైతులు వచ్చే నెల 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి. సంబంధిత ధ్రువీకరణ పత్రాలను ఆయా గ్రామాల ఏఈఓలకు అందజేయాలి. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని అర్హులైన రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలి.

– పాల్వాయి శ్రవణ్‌కుమార్, డీఏఓ

5 ఎకరాల్లోపు రైతుల గుర్తింపు..

కాంగ్రెస్ ప్రభుత్వం ఈసారి కొత్తగా బీమా చేసుకునే రైతుల కోసం నూతన ఆలోచనకు శ్రీకారం చుట్టింది. 5 ఎకరాల్లోపు ఉన్న చిన్న, సన్న కారు రైతులను గుర్తించి వారి నుంచి కచ్చితంగా రైతు బీమా కోసం దరఖాస్తులు స్వీకరించాలని నిర్ణయించింది. స్థానికంగా ఉండని రైతులు, వలస వెళ్లిన రైతులను గుర్తించి వారి ద్వారా రైతు బీమా దరఖాస్తులు చేయించాలనే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉంది.

నేతన్నకు దక్కిన గౌరవం


తాను రూపొందించిన చీరను చూపుతున్న కర్నాటి ముఖేష్

- ప్రకృతి సిద్ధ రంగులతో చీర తయారుచేసిన కొయ్యలగూడెం యువకుడు
- తెలంగాణ రాష్ట్రం నుంచి జాతీయ పురస్కారానికి ఎంపిక

చౌటుప్పల్: మండలంలోని కొయ్యలగూడెం(ప్రస్తుతం ఎల్లంబావి) గ్రామానికి చెందిన కర్నాటి ముఖేష్ ప్రకృతి సిద్ధ రంగులతో తయారుచేసిన చీర జాతీయ పురస్కారానికి ఎంపికై ంది. కర్నాటి ముఖేష్ కుటుంబ సభ్యులతో కలసి రెండేళ్లపాటు శ్రమించి పది రకాల రంగులను అద్దడం ద్వారా వంద పూల డిజైన్‌తో డబుల్ ఇక్కత్ చీరను నేశాడు. ఈ చీరను జాతీయ నిపుణుల కమిటీ 2023 సంవత్సరానికిగాను జాతీయ పురస్కారానికి ఎంపిక చేసింది. దేశ వ్యాప్తంగా 14 మంది జాతీయ పురస్కారాలకు ఎంపికయ్యారు. తెలంగాణ రాష్ట్రం నుంచి 27మంది దరఖాస్తు చేసుకోగా ముఖేష్‌ను ఈ పురస్కారానికి ఎంపిక చేశారు. ప్రకృతి సిద్ధమైన చెట్లు, పండ్లు, పుష్పాలు, ఆహార పదార్థాలు, కూరగాయలతో పాటు ప్రకృతిలో లభించే అన్నిరకాల సహజ సిద్ధమైన రంగులతో తయారుచేసిన ఈ చీర పర్యావరణహితంగా ఉంది. ఈ చీరను వాషింగ్ చేయడం కోసం కుంకుడు కాయ రసాన్ని వినియోగించాలని ముఖేష్ చెబుతున్నాడు.

ఇదే స్ఫూర్తితో మరిన్ని ప్రయోగాలు

తాతల తరాల నుంచి చేనేత వృత్తి పైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నాం. వృత్తిలో కొత్తదనం కోసం ప్రయోగాలు చేయడం ప్రారంభించాను. అందులో భాగంగానే ప్రకృతి సిద్ధమైన రంగులతో చీరను తయారు చేశాను. ముందుగా చీరకు అవసరమైన నూలును కుంకుడుకాయ రసం, కరక్కాయ పొడితో శుద్ధి చేశా. పడుగు, పేక ఒక్కో పోగును కలుపుతూ రెండేళ్ల శ్రమించాను. దీంతో 46 అడుగుల వెడల్పు, 7మీటర్ల పొడవుతో 600గ్రాముల బరువు ఉన్న చీరను తయారుచేశాను. 2022లో రాష్ట్రస్థాయిలో ఆచార్య కొండా లక్ష్మణ్‌బాపూజీ పురస్కారాన్ని కూడా అందుకున్నాను. తనను జాతీయ పురస్కారానికి ఎంపిక చేయడం ఆనందంగా ఉంది. కుటుంబ సభ్యుల ప్రోత్సాహం మరువలేనిది. ఇదే స్ఫూర్తితో మరిన్ని ప్రయోగాలు చేస్తాను. ఇలాంటి ప్రోత్సాహం అందిస్తే చేనేత రంగం మరింత అభివృద్ధి చెంది చేనేత కళాకారులకు గుర్తింపు వస్తుంది.

– కర్నాటి ముఖేష్, కొయ్యలగూడెం

వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే ఆరోపణలు

- కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు గోలి మధుసూదన్‌రెడ్డి


మాట్లాడుతున్న గోలి మధుసూదన్‌రెడ్డి

నేరేడుచర్ల: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను కప్పిపుచ్చుకునేందుకు కేంద్ర బడ్జెట్‌పై ఆరోపణలు చేస్తోందని బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు గోలి మధుసూదన్‌రెడ్డి విమర్శించారు. బుధవారం నేరేడుచర్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బడ్జెట్ అనేది కేవలం ఒకటి, రెండు రాష్ట్రాలకు సంబంధించింది కాదని, అన్ని రాష్ట్రాలకు వర్తిస్తుందన్నారు. వ్యవసాయ రంగానికి పెద్దపీట వేసింది బీజేపీ మాత్రమేనని గుర్తు చేశారు. పట్టణాభివృద్ధికి రూ.10లక్షల కోట్లు కేటాయించారని, రాజ్యాంగం ప్రకారం తెలంగాణకు కూడా వర్తిస్తుందన్నారు. కస్టమ్స్ డ్యూటీ తగ్గింపుతో వెండి, బంగారం ధరలు తగ్గిపోయాయని, నిరుద్యోగం, ఉపాధి సమస్యను అధిగమించేందుకు, ఉపాధి అవకాశాలు పెంచేందుకు, వ్యవసాయరంగం మెరుగయ్యేందుకు బీజేపీ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. బీఆర్ఎస్ పార్టీపై ఉన్న వ్యతిరేకతతోనే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం త్వరితగతిన అమలు చేయాలన్నారు. ఈ నెల 27వ తేదీ నుంచి ఆగస్టు 15వ తేదీ వరకు దశలవారీగా పోరాటాలు నిర్వహిస్తామని అన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొబ్బ భాగ్యారెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బాల వెంకటేశ్వర్లు, సంకలమద్ది సత్యనారాయణరెడ్డి, పార్ధనబోయిన విజయ్‌కుమార్, విజయభాస్కర్‌రెడ్డి, నాగిరెడ్డి, వీరబాబు, అశోక్, నరేందర్‌రెడ్డి, ఖాగేశ్వర్‌రావు, లాజర్, సతీష్, సైదులు, నాగయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, నరినాయక్, కిరణ్‌దేవిరెడ్డి, నాగిరెడ్డి తదితరులున్నారు.

తల్లిదండ్రులు మందలించడంతో యువతి బలవన్మరణం

మద్దిరాల: మార్కులు తక్కువ వచ్చాయని తల్లిదండ్రుల మందలించడంతో మనస్తాపానికి గురైన యువతి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మద్దిరాల మండలం కుక్కడం గ్రామంలో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుక్కడం గ్రామానికి చెందిన బింగి సోమయ్య, శోభ దంపతులు కొన్నేళ్ల క్రితం సూర్యాపేటకు వలస వెళ్లి అక్కడే ఉంటున్నారు. వారికి కుమారుడు, కుమార్తె సంతానం. కూమార్తె అక్షిత (20) సూర్యాపేటలోని ఎస్వీ ఇంజనీరింగ్ కాలేజీలో మొదటి సంవత్సరం పూర్తి చేసింది. ఇటీవల పరీక్షల్లో ఆమెకు మార్కులు తక్కువగా రావడంతో తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన అక్షిత జ్వరం తగ్గేందుకు ఉపయోగించే మాత్రలు 20 ఒకేసారి మింగడంతో అస్వస్థతకు గురయ్యింది. కుటుంబ సభ్యులు గమనించి హైదరాబాద్‌లోని యశోదా హాస్పిటల్‌కు తీసుకెళ్లగా.. చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలి తండ్రి సోమయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తుంగతుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ మధునాయుడు తెలిపారు.

వర్షానికి కూలిపోయిన ఇల్లు


కూలిపోయిన పెంకుటిల్లు

మోత్కూరు: ఇటీవల కురిసిన ముసురు వర్షాలతో మోత్కూరు మండలంలోని పొడిచేడు గ్రామంలో నల్ల ధనుంజయ్యకు చెందిన పెంకుటిల్లు బుధవారం తెల్లవారుజామున కూలిపోయింది. కుటుంబ సభ్యులు వరండాలో పడుకోవడంతో ప్రమాదం తప్పిందని బాధితుడు తెలిపాడు.

అక్రమంగా చెరువు మట్టి తవ్వకం


మట్టిని తవ్వి ట్రాక్టర్‌లో పోస్తున్న జేసీబీ

- రెవెన్యూ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు

యాదగిరిగుట్ట రూరల్: అక్రమంగా చెరువు మట్టిని తవ్వుతున్న వారిపై రెవెన్యూ అధికారుల ఫిర్యాదు మేరకు బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. యాదగిరిగుట్ట మున్సిపాలిటీ పరిధిలోని చాకలిగిద్దె చెరువు సమీపంలో నుంచి కొంతమంది అక్రమంగా మట్టిని తవ్వుతున్నారు. గ్రామస్తులు ఇచ్చిన సమాచారం మేరకు రెవెన్యూ అధికారులు పోలీసుల సహాయంతో మట్టి తవ్వుతున్న ప్రదేశానికి వెళ్లి ఒక జేసీబీ, మూడు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. మట్టి తవ్వకాలు చేపట్టిన వారిపై కేసును నమోదు చేసినట్లు తహసీల్దార్ తెలిపారు. అనుమతులు లేకుండా ఎలాంటి తవ్వకాలు చేపట్టినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ప్రకాశం బజార్‌లోని పలు దుకాణాల్లో తనిఖీలు


ఎలక్ట్రికల్ షాపులో తనిఖీలు చేస్తున్న పోలీసులు

నల్లగొండ క్రైం: నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని ప్రకాశం బజార్‌లో గల పలు దుకాణాల్లో కాపీరైట్స్ అధికారులు, వన్‌టౌన్ పోలీసులు బుధవారం తనిఖీలు చేశారు. వివిధ షాపుల్లో నాణ్యత లేని, పేరు మార్చి అమ్ముతున్న రూ.22 లక్షల విలువైన 16 విద్యుత్ వైర్ బ్యాగులను స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. హనుమాన్ ఎలక్ట్రిక్ షాపులో గోల్డ్ మెడల్ కంపెనీ పేరు చెప్పి నాణ్యత లేని విద్యుత్ వైర్లు అమ్ముతున్నట్లు గుర్తించారు. పద్మావతి కిరాణ షాపులో రూ.1.20లక్షల నకిలీ మస్కిటో కాయిల్స్ స్వాధీనం చేసుకున్నారు. నకిలీ వస్తువులకు పేరు మార్చి.. బ్రాండెడ్ పేరుతో విద్యుత్ వైర్లు అమ్ముతున్నట్లు ముంబై కాపీ రైట్స్ అధికారులు గుర్తించారు. కొన్ని నెలలుగా గోల్డ్ మెడల్ కంపెనీ పేరు చెప్పి నాణ్యత లేని విద్యుత్ వైర్లు అమ్ముతున్నట్లు ఫిర్యాదులు రావడంతో సోదాలు నిర్వహించినట్లు తెలిపారు. షేర్‌బంగ్లా, పద్మావతి కిరాణం జనరల్ స్టోర్‌లో స్లీప్‌వెల్ కంపెనీ పేరుతో ఉన్న నకిలీ అగర్‌బత్తీలు ఏడు బాక్సులు స్వాధీనం చేసుకున్నారు. నాణ్యత లేని వస్తువులు అమ్ముతున్న మదన్, శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. తనిఖీల్లో ఐపీ ఇన్వెస్టిగేషన్ అధికారి ఇబ్రార్, ఎస్ఐ సందీప్‌రెడ్డి, శంకర్, కాపీరైట్ అధికారి ఇక్బాల్ ఖాద్రి, దినేష్ సెట్టి, సంతోష్, దీపక్ పాల్గొన్నారు.

ప్రజా పాలనలో ఫిర్యాదు చేశారని దాడి

నిడమనూరు: ప్రజాపాలనలో ఫిర్యాదు చేస్తారా అంటూ మహిళను, అతడి కుమారుడిపై దాడి చేశారు. ఈ ఘటన నిడమనూరు మండలం శాఖాపురంలో మంగళవారం రాత్రి జరిగింది. శాఖాపురం గ్రామానికి నలల్లంతుల సోములు కుమారుడు గిరి ఈ నెల 1వ తేదీన వీధిలో అడ్డంగా గేదెలను కట్టివేస్తున్నారని ప్రజాపాలనలో ఫిర్యాదు చేశాడు. ఇన్ని రోజులైనా పట్టించుకోవడం లేదని పలుసార్లు అధికారులను కలిసి సమస్య పరిష్కారం కాలేదని అడిగాడు. మంగళవారం రాత్రి అటుడా సోములు భార్య రాములమ్మను గంటా లింగయ్య కుటుంబ సభ్యులు అసభ్య పదజాలంతో దూషించారు. ప్రజాపాలనలో ఫిర్యాదు చేస్తారా అని ఆమెను కొట్టారు. విషయం తెలుసుకున్న గిరి అక్కడి వచ్చి తన తల్లిని ఎందుకు కొడుతున్నారంటూ అడ్డుపడగా అతడిపై కూడా దాడి చేశారు. సోములు పెద్ద కుమారుడు నల్లగంతుల నర్సింహ డయల్ 100కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. బుధవారం ఏఎస్ఐ జోజి, ఎస్ఐ గోపాలరావు ఘటనా స్థలానికి వెళ్లి విచారించారు. వీధిలో కట్టేసిన గేదెలను తీసి వేయించారు. ఇరు వర్గాలు పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నారని, ఇరు వర్గాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గోపాలరావు తెలిపారు.

అమరుల స్ఫూర్తితో ఉద్యమాలు చేపట్టాలి

- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు వెంకట్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి
- పుట్టపాక అమరవీరులకు నివాళులర్పించిన పార్టీ నాయకులు


అమరుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న బి. వెంకట్, జూలకంటి రంగారెడ్డి

సంస్థాన్ నారాయణపురం: ప్రజల కోసం తమ ప్రాణాలనే పణంగా పెట్టిన పుట్టపాక అమరవీరుల స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు చేపట్టాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు బి. వెంకట్, పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో నిర్వహించిన సీపీఎం నాయకులు మర్రి నర్సిరెడ్డి, సుక్క అబ్బయ్య, నడికుడి శంకరయ్య, నడికుడి బచ్చయ్యల 25వ వర్ధంతి కార్యక్రమంలో వారు పాల్గొని నివాళులర్పించారు. రాచకొండ రమేష్, మందుల విప్లవ్ రచించి, గద్దర్ నర్సిరెడ్డి, చింతల యాదగిరి, ఆనంద్, వెంకటరెడ్డి పాడిన అమరుల యాదిలో అనే పాటల సీడీని ఆవిష్కరించారు. అనంతం బి. వెంకట్, జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమించే సత్తా కమ్యూనిస్టు పార్టీలకే ఉందన్నారు. కేంద్రం రూ.48లక్షల కోట్లతో ప్రవేశపెట్టిన బడ్జెట్ గత సంవత్సరంతో పోలిస్తే పెరిగినప్పటికీ పేదలకు ఉపయోగపడే విధంగా లేదన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలకు బడ్జెట్‌లో సరైన కేటాయింపులు జరగలేదని, పెట్టుబడి దారులకు మాత్రమే ఉపయోగపడే విధంగా ఉందన్నారు. ఎరువుల సబ్సిడీలను గత రెండేళ్లలో రూ.లక్ష కోట్లు తగ్గించారని, ఆహార సబ్సిడీలను రూ.70 వేల కోట్లు తగ్గించారన్నారు. రేషన్ షాపుల ద్వారా బియ్యాన్ని పంపిణీ చేయకుండా నగదు బదిలీ చేస్తామనడం సరికాదన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ. జహంగీర్, దొంతగోని పెద్దులు, సుర్కంటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నర్సిరెడ్డి, మండల కార్యదర్శి దొడ యాదిరెడ్డి, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్, ప్రధాన కార్యదర్శి ఆనగంటి వెంకటేష్, జి. శ్రీనివాసచారి, పుట్టపాక మాజీ ఎంపీటీసీ మర్రి వసంత, ముత్యాలు, రాములు, నాంపల్లి చంద్రమౌళి, చంద్రశేఖర్, గాలయ్య తదితరలున్నారు.

బెటాలియన్ ఏర్పాటును విరమించుకోవాలి..

సంస్థాన్ నారాయణపురంలో రైతులు సాగు చేసుకుంటున్న భూమిలో పోలీస్ బెటాలియన్ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనను విరమించుకోవాలని బి. వెంకట్, జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం బెటాలియన్ ఏర్పాటు చేయదల్చిన భూమిని వారు పరిశీలించి రైతులతో మాట్లాడారు. రైతులకు అండగా ఉంటామన్నారు.

భూగర్భ జలాల నిర్వహణకు నిపుణులు అవసరం

- సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డు రీజనల్ డైరెక్టర్ కృష్ణమూర్తి


మాట్లాడుతున్న సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డు రీజనల్ డైరెక్టర్ కృష్ణమూర్తి

నల్లగొండ రూరల్: భూగర్భ జలాల నిర్వహణకు నిపుణుల అవసరం ఉందని సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డు రీజనల్ డైరెక్టర్ కృష్ణమూర్తి అన్నారు. మహాత్మాగాంధీ యూనివర్సిటీలో బుధవారం జియాలజీ, వాటర్ బోర్డు ఆధ్వర్యంలో నిర్వహించిన మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఎంజీయూ రిజిస్ట్రార్ రవి, సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రేమ్‌సాగర్‌తో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. దేశ జనాభాకు అనుగుణంగా సహజ వనరుల వినియోగంతో సుస్థిర జల నిర్వహణకు నిపుణుల అవసరం ఉందన్నారు. మారుతున్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను చేరుకునుటకు జల వినియోగంపై దృష్టి సారించాలన్నారు. జియాలజీ విద్యార్థులకు భూగర్భ జలాల స్థితిగతులపై అవగాహన ఉండాలన్నారు. పీఠభూమి ప్రాంతమైన తెలంగాణలో వర్షాధారం, నూతనంగా నిర్మించిన ప్రాజెక్టుల వినియోగం, ఇంకుడు గుంతలు తదితర అంశాలపై ప్రజల్లో అవగాహన రావాలన్నారు. వాటర్ బోర్డు శాస్త్రవేత్తలు సుధీర్‌కుమార్, రాణి రిమోట్‌సెన్సింగ్, ఐజీఎస్ విధానంలో భూగర్భ జలాల గుర్తింపు, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలిపారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు టి. మాధవ్, యాదయ్య, మధుసూదన్‌రెడ్డి, ఆంజనేయులు, మత్స్యేందర్, సుధాకర్ పాల్గొన్నారు.

యువతిని మోసం చేసిన వ్యక్తిపై కేసు

స్టేషన్‌ఘన్‌పూర్: వివాహం చేసుకుంటానని నమ్మించి యువతిని లోబర్చుకుని మోసం చేసిన యువకుడిపై స్టేషన్‌ఘన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం తాటికొండ గ్రామానికి చెందిన మేకల లక్ష్మణ్.. అతడి స్నేహితుడి సహకారంతో యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరుకు చెందిన యువతిని కొన్ని నెలల క్రితం ఫోన్‌లో పరిచయం చేసుకున్నాడు. అప్పటినుంచి ఫోన్‌లో మాట్లాడి ఆమె నివాసం వివరాలు తెలుసుకున్నాడు. యువతి హైదరాబాద్ మౌలాలి హౌసింగ్ బోర్డులో తల్లిదండ్రులతో కలిసి ఉంటున్న విషయం తెలుసుకుని ఈనెల 19న లక్ష్మణ్ అక్కడికి వెళ్లాడు. వివాహం చేసుకుంటానని నమ్మించి ఆమెతో కలిసి అదేరోజు రాత్రి రైలు ఎక్కి స్టేషన్‌ఘన్‌పూర్ రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. స్టేషన్‌లో ప్లాట్‌ఫామ్‌పైన ఆమెతో గొడవ పడ్డాడు. మరుసటి రోజు యువతిని తీసుకుని తిరిగి చెర్లపల్లి రైల్వేస్టేషన్‌కు వెళ్లాడు. అదే రోజు రాత్రి సమీపాన ఖాళీగా ఉన్న డబుల్‌బెడ్రూం ఇంటిలో గడిపారు. ఆ రాత్రి ఆమెను లైంగికంగా లోబర్చుకున్నాడు. 21వ తేదీ ఉదయం యువతిని మౌలాలి వద్ద వదిలేసి ఫోన్ స్విచ్‌ఆఫ్ చేసుకుని లక్ష్మణ్ స్వగ్రామానికి తిరిగి వచ్చాడు. యువతి జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పగా వారు మంగళవారం ఆలేరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అక్కడి పోలీసులు కేసును స్టేషన్‌ఘన్‌పూర్ పోలీసులకు అప్పగించగా.. సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించారు. అతడిపై కేసు నమోదు చేసినట్లు సీఐ ముస్క రాజు తెలిపారు.

కూలీల ఆటో బోల్తా

కూసుమంచి: వరి నాట్లు వేసిన వెళ్తున్న కూలీల ఆటో బోల్తా పడడంతో పలువురికి గాయాలయ్యాయి. సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం రాంచంద్రాపురానికి గ్రామానికి చెందిన మహిళా కూలీలు ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం పాలేరులో నాట్లు వేసేందుకు బుధవారం వచ్చారు. సాయంత్రం తిరిగి ఆటోలో గ్రామానికి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న బైక్‌ను తప్పించే క్రమంలో ఆటోడ్రైవర్ బ్రేక్ వేయడంతో బోల్తా కొట్టింది. ఈఘటనలో 12 మంది కూలీలు గాయపడగా స్థానికులు 108 ద్వారా ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా, ఇద్దరికి కాళ్లు, చేతులు విరిగి తీవ్ర గాయాలైనట్లు తెలిసింది.

నేటి నుంచి మూసీ నీటి విడుదల

- ఆన్ అండ్ ఆఫ్ పద్ధతిలో వదిలేందుకు ఏర్పాట్లు
- వానాకాలం పంటల సాగుకు నాలుగు విడతలుగా..


నీటితో కళకళలాడుతున్న మూసీ రిజర్వాయర్

కేతేపల్లి: జిల్లాలో నాగార్జునసాగర్ ప్రాజెక్టు తర్వాత అతిపెద్ద సాగునీటి వనరుగా ఉన్న మూసీ ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలో వానాకాలం పంటల సాగుకు నీటిని విడుదల చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. గురువారం నుంచి ఆన్ అండ్ ఆఫ్ పద్ధతిలో ప్రాజెక్టు కుడి, ఎడమ ప్రధాన కాల్వలకు నాలుగు విడతలుగా నీటిని విడుదల చేసేలా ప్రణాళిక రూపొందించారు. తొలి విడత 25 రోజులు, ఒక్కో విడతకు పది రోజుల విరామంతో విడతకు 15 రోజులు నీళ్లు వదులుతారు. మూసీ ప్రాజెక్టు గరిష్ట నీటిమట్టం 645 అడుగులు(4.46 టీఎంసీలు) కాగా ప్రస్తుతం 641.80 (3.60 టీఎంసీలు) అడుగులుగా ఉంది. మూసీ నీటితో ఉమ్మడి జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో దాదాపు 35 వేల ఆయకట్టు భూములు సాగులోకి రానున్నాయి. కాలువలకు నీటిని విడుదల చేస్తున్నందున ఆయకట్టు గ్రామాల్లోని చెరువులు, కుంటలు నిండనున్నాయి. ఇప్పటికే సాగు పనుల్లో బిజీగా ఉన్న రైతులు ప్రాజెక్టు నుంచి నీటిని విడుదలకు షెడ్యూల్ ప్రకటించడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆయకట్టులో వరిపొలాల సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. బోరు, బావులు ఉన్నచోట మడులు తడుపుతూ నార్లు పోశారు.

ఆరేళ్లుగా రెండు పంటలకు సాగునీరు

మూసీ ప్రాజెక్టు పూర్తిగా వర్షాలపైనే ఆధారపడి నిండుతుంది. దీంతో ప్రాజెక్టు నిర్మాణ సమయంలో కేవలం ఒకే పంటకు(యాసంగి) వారబందీ పద్ధతిలో ఆరుతడి పంటలకు మాత్రమే నీటిని విడుదల చేసేలా 4.46టీఎంసీల నీటినిల్వ సామర్థ్యంతో ప్రాజెక్టును డిజైన్ చేసి నిర్మించారు. 1963లో మూసీ ప్రాజెక్టు నిర్మాణం జరిగిన నాటి నుంచి 2018 వరకు కేవలం ఒకసారి మాత్రమే రెండు పంటలకు సాగు నీరందించారు. కానీ గత ఐదారేళ్లగా వానాకాలం ప్రారంభంలోనే వర్షాలు సమృద్ధిగా కురుస్తుండడంతో మూసీ రిజర్వాయర్‌లో నీటిమట్టం గరిష్టస్థాయికి చేరుతుంది. దీంతో యాసంగి, వానాకాలం రెండు పంటల సాగుకు నీటిని విడుదల చేస్తున్నారు.

కొనసాగుతున్న ఇన్‌ఫ్లో..

మూసీ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. హైదరాబాద్‌తో పాటు ఎగువన గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరద నీరు వస్తుండడంతో మూసీ ప్రాజెక్టులో నీటిమట్టం పెరుగుతోంది. బుధవారం మూసీకి 1362 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరింది. మూసీ ప్రాజెక్టు గరిష్ట నీటిమట్టం 645 అడుగులు కాగా బుధవారం సాయంత్రానికి 641.80 అడుగులకు చేరుకుందని ప్రాజెక్టు ఏఈ ఉదయ్‌కుమార్ తెలిపారు. ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 4.46 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 3.64 టీఎంసీల నీరు నిల్వ ఉంది.